# గరిష్ఠ స్థాయిలోనే వడ్డీ రేట్లు

## ద్రవ్యోల్బణం తగ్గేంతవరకూ ఆర్బీఐ వైఖరి ఇదే

### వరుసగా ఆరోసారీ రెపో రేటు యథాతథం




భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా మార్గాలకు ఆటంకం ఏర్పడటం, అంతర్జాతీయ ఫైనాన్షియల్ మార్కెట్ల ఒడిదుడుకులు ఆర్థికాభివృద్ధికి రిస్క్‌గా భావిస్తున్నాం

– శక్తికాంత దాస్, ఆర్బీఐ గవర్నర్

### 2024-25లో వృద్ధిరేటు 7 శాతమే

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) దేశ జీడీపీ వృద్ధిరేటు 7 శాతంగానే ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) 7.3 శాతంగా ఉంటుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) అంచనా వేస్తున్నది. దీంతో రాబోయే ఆర్థిక సంవత్సరం కొంత ఇబ్బందికర పరిస్థితులేనన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిజానికి గత ఆర్థిక సంవత్సరం (2022-23)లోనూ దేశ వృద్ధిరేటు 7.2 శాతంగా నమోదైంది. కానీ ఆర్బీఐ తాజా అంచనాలతో జీడీపీ మరింత క్షీణిస్తుందని అర్థమవుతున్నది.

ముంబై, ఫిబ్రవరి 8: త్వరలో వడ్డీ రేట్లు తగ్గుతాయంటూ రిజర్వ్‌బ్యాంక్ వెల్లడించే సంకేతాల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురయ్యింది. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులకు తోడు ద్రవ్యోల్బణం 4 శాతానికి దించాల్సిన అవసరం ఉన్నందున కీలక పాలసీ రేటును యథాతథంగా అట్టిపెడుతున్నట్టు ఆర్బీఐ ప్రకటించింది. రెపో రేటును 6.5 శాతం వద్దే ఉంచడం వరుసగా ఇది ఆరోసారి. అలాగే సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్ల పట్ల ఆర్బీఐ వైఖరిని సైతం మార్పు చేయలేదు. మరికొంతకాలం గరిష్ఠస్థాయిలోనే వడ్డీ రేట్లు ఉంటాయని సూచిస్తూ 'విత్‌డ్రాయిల్ ఆఫ్ అకామిడేషన్' (కఠిన ద్రవ్య విధానం) వైఖరిని కొనసాగిస్తామని పేర్కొంది. మూడు రోజుల ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాల్ని గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం వెల్లడించారు. తాజా పాలసీలో ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో ఐదుగురు అనుకూలంగా ఓటు వేయగా, ఒక్కరు వ్యతిరేకంగా వేశారు.





ద్రవ్యపరపతి సమీక్ష సమావేశం సందర్భంగా రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్‌తో డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జానకీరామన్, మైకేల్ దేవవ్రత, ఎం రాజేశ్వర్ రావు, టీ రవి శంకర్

- స్థూల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పాలసీ రెపో రేటును యథాతథంగా ఉంచాలి.
- ద్రవ్యోల్బణం 4 శాతం లక్ష్యానికి దిగివచ్చేంతవరకూ ఆర్థికాభివృద్ధికి మద్దతు ఇస్తూనే 'విత్‌డ్రాయిల్ ఆఫ్ అకామిడేషన్'పై దృష్టి నిలపాలి.
- పలు దఫాలుగా పెంచిన పాలసీ రేటు ఇంకా ఆర్థిక వ్యవస్థలోకి పూర్తిగా మళ్లలేదు.
- 2024-25 సంవత్సరంలో జీడీపీ వృద్ధి 7 శాతం, రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతం ఉంటుందని అంచనా.
- 2023-24లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం, క్యూ4లో 5 శాతంగా అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం రుతుపవనాలు సాధారణంగా ఉంటే 4.5 శాతానికి తగ్గుతుంది. 2024-25 క్యూ1లో 5 శాతం, క్యూ2లో 4 శాతం, క్యూ3లో 4.6 శాతం, క్యూ4లో 4.7 శాతంగా అంచనా.
- తరచూ ఆహారోత్పత్తుల ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం దిగిరావడం లేదు. -4 శాతానికి ద్రవ్యోల్బణాన్ని తగ్గించాలన్న లక్ష్యానికి ఎంపీసీ కట్టుబడి ఉంది.
- పెట్టుబడుల డిమాండ్, ఆశావహ వ్యాపార సెంటిమెంట్, వినియోగదారుల విశ్వాసం పెరగడం వంటి అంశాలతో దేశంలో ఆర్థిక కార్యకలాపాలు చురుగ్గా సాగుతున్నాయి.
- వచ్చే సమీక్ష ఏప్రిల్ 3-5 వరకు

## ఆఫ్‌లైన్‌లోనూ ఈ-రుపీ



త్వరలో ఈ-రుపీ లావాదేవీలను ఆఫ్‌లైన్‌లోనూ ఆర్బీఐ అందుబాటులోకి తేనున్నది. దీంతో డిజిటల్ రుపీ వినియోగదారులు ఇంటర్నెట్ సదుపాయం లేనిచోట కూడా తమ లావాదేవీలను కొనసాగించుకునే అవకాశం రానున్నది. ప్రస్తుత సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) పైలట్ ప్రాజెక్టుపైనే ఆఫ్‌లైన్ ఈ-రుపీ లావాదేవీలను పరిచయం చేయనున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. 2022 డిసెంబర్‌లో పైలట్ ప్రాజెక్టుగా రిటైల్ సీబీడీసీని ఆర్బీఐ ప్రారంభించిన విషయం తెలిసిందే. 2023 డిసెంబర్‌లో ఇది 10 లక్షల లావాదేవీలకు చేరింది. ఎంపిక చేసిన బ్యాంకులు తమ కస్టమర్లకు డిజిటల్ రుపీ వ్యాలెట్ల సౌకర్యాన్ని అందిస్తున్నాయి. వీటి ద్వారానే వ్యక్తుల మధ్య, వ్యక్తులు-వ్యాపారుల మధ్య లావాదేవీలు జరుగుతున్నాయి. ఇక ఇప్పటికే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులను ఆఫ్‌లైన్‌లోనూ జరిపేలా ఆర్బీఐ అనుమతించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఈ-రుపీపై తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.

## ద్రవ్యోల్బణం 4.5 శాతం

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) 5.4 శాతంగా ఉంటుందన్నది. కాగా, వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్దే అదుపు చేయాలన్నది ఆర్బీఐ లక్ష్యం. ఇందుకు 2 శాతం మినహాయింపున్నది. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ 6 శాతంగా ద్రవ్యోల్బణం ఉండరాదు. ఒకవేళ ఉంటే దాన్ని తీవ్రంగా పరిగణించి కఠిన ద్రవ్యవిధాన చర్యలకు ఆర్బీఐ దిగాల్సి ఉంటుంది. నిరుడు డిసెంబర్‌లో 5.7 శాతంగా నమోదైన విషయం తెలిసిందే.



### కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ ఇవ్వాలి

ఆర్బీఐ నియంత్రణలోని అన్ని బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థలు తమ రుణగ్రహీతలకు కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్‌ఎస్)ను తప్పనిసరిగా అందించాల్సిందేనని గవర్నర్ దాస్ స్పష్టం చేశారు. అటు రిటైల్, ఇటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకిచ్చే లోన్లకూ ఇది వర్తిస్తుందని చెప్పారు. లోన్ అగ్రిమెంట్, అన్నిరకాల వడ్డీరేట్లు, చార్జీలు, నియమ-నిబంధనలు ఈ కేఎఫ్‌ఎస్‌లో సరళమైన భాషలో రుణగ్రహీతలకు సులువుగా అర్థమయ్యేలా ఉండాలని సూచించారు.

## మహిళా డెవలపర్స్‌కు మైక్రోసాఫ్ట్ దన్ను

### 75 వేల మందికి క్లౌడ్, ఏఐ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో శిక్షణ

బెంగళూరు, ఫిబ్రవరి 8: ప్రస్తుతేడాది చివరినాటికి దేశవ్యాప్తంగా 75 వేల మంది డెవలపర్లకు నైపుణ్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ చీఫ్ సత్యానాదెళ్ల ప్రకటించారు. ఇందుకోసం గతంలో ప్రకటించిన మైక్రోసాఫ్ట్ కోడ్ వితౌట్ బారియర్ కార్యక్రమాన్ని పొడిగిస్తున్నట్లు, ఈ పథకంలో భాగంగా మహిళా డెవలపర్లకు క్లౌడ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. కృత్రిమ మేధస్సు ఆవిష్కరణను మరింత వేగవంతం చేయడంలో దేశీయ డెవలపర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్ కింద 1,100 మంది డెవలపర్లు, టెక్నాలజీ లీడర్లు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంస్థ ప్రారంభించిన కోడ్ వితౌట్ బారియర్ కార్యక్రమం ప్రస్తుత నెలలోనే భారత్‌లో ప్రారంభించనున్నట్లు ప్రకటించిన ఆయన.. దీంట్లో భాగంగానే 75 వేల మంది మహిళలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

## ఎల్ఐసీ లాభం 9,444 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.9,444 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6334 కోట్లతో పోలిస్తే 49 శాతం వృద్ధిని సాధించింది. గత త్రైమాసికంలో ప్రీమియం వసూళ్ల ద్వారా సంస్థకు రూ.1,17,017 కోట్ల ఆదాయం సమకూరడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ చైర్మన్ సిద్దార్థ మోహంతీ తెలిపారు. క్రితం ఏడాది ఇది రూ.1,11,788 కోట్లుగా ఉన్నది. అలాగే కంపెనీ మొత్తం ఆదాయం రూ.1,96,891 కోట్ల నుంచి రూ.2,12,447 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.4 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మరోవైపు కంపెనీ అసెట్ అండర్ మేనేజ్‌మెంట్(నిర్వహణలో ఉన్న ఆస్తి విలువ-ఏయూఎం) రూ.44.34 లక్షల కోట్ల నుంచి రూ.49.66 లక్షల కోట్లకు చేరుకున్నది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో(ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) రూ.3,22,776 కోట్ల ఆదాయంపై రూ.26,913 కోట్ల లాభాన్ని గడించింది. 58.90 శాతం మార్కెట్ వాటాతో సంస్థ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతున్నది.

### అండగా నిలిచిన నికర ప్రీమియం



### టాప్-5లోకి ఎల్ఐసీ..

దేశీయ అత్యంత విలువైన సంస్థల జాబితాలోకి బీమా దిగ్గజం ఎల్ఐసీ కూడా చేరింది. గత కొన్నిరోజులుగా కంపెనీ షేరు ధర ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుండటంతో మార్కెట్ విలువ అంతకంతకు పెరుగుతున్నది. దీంట్లోభాగంగానే గురువారం షేరు ధర 6 శాతం లాభపడటంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6.99 లక్షల కోట్లకు చేరుకున్నది. దేశీయ అత్యంత విలువైన సంస్థల జాబితాలో టాప్-5 స్థానాన్ని దక్కించుకున్నది. ఇంట్రాడేలో 9.51 శాతం లాభపడిన కంపెనీ షేరు చివరకు 5.86 శాతం లాభంతో రూ.1,106.25 వద్ద ముగిసింది. అటు ఎన్‌ఎస్‌ఈలోనూ 6.46 శాతం ఎగబాకి రూ.1,112 వద్ద స్థిరపడింది. రూ.1,000 కంటే అధికంగా నమోదవడం ఇదే తొలిసారి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.38,740.62 కోట్లు పెరిగి రూ.6,99,702.87 కోట్లకు చేరుకున్నది. టాప్-5లో కొనసాగుతున్న ఐసీఐసీఐ బ్యాంక్‌ను వెనక్కినెట్టి ఈ స్థానాన్ని ఎల్ఐసీ కైవసం చేసుకున్నది. గత నెలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)ని దాటేసిన ఎల్ఐసీ ఈసారి ఐసీఐసీఐ బ్యాంక్ ర్యాంక్‌ను అధిగమించింది. మే 2022లో స్టాక్ మార్కెట్లోకి లిస్టైన ఎల్ఐసీ..సంస్థలో కేంద్రానికి ఉన్న షేర్లలో 22.13 కోట్ల షేర్లు లేదా 3.5 శాతం వాటాను బహిరంగ మార్కెట్లో విక్రయించింది. ప్రస్తుతం సంస్థలో కేంద్రానికి 96.5 శాతం వాటా ఉన్నది.

**టాప్-5 విలువైన సంస్థలు**

| సంస్థ | విలువ(రూ.కోట్లలో) |
|---|---|
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 19,64,044.94 |
| టీసీఎస్ | 15,13,218.99 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 10,66,150.51 |
| ఇన్ఫోసిస్ | 7,02,754.66 |
| ఎల్ఐసీ | 6,99,702.87 |



### పేటీఎం నిర్లక్ష్యం వల్లే ..

ముంబై, ఫిబ్రవరి 8: ఎన్నిసార్లు హెచ్చరించినా రెగ్యులేటరీ మార్గదర్శకాలను పేటీఎం అనుసరించలేదని, దాని నిర్లక్ష్యం వల్లే కఠిన చర్యలకు దిగాల్సి వచ్చిందని ఆర్బీఐ స్పష్టం చేసింది. అంతేగానీ వ్యవస్థీకృత ఆందోళనలేమీ లేవని ఆర్బీఐ గవర్నర్ దాస్ వెల్లడించారు. ఈ నెల 29 తర్వాత పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లోని ఖాతాలు, ప్రీ-పెయిడ్ సాధనాలు, ఈ-వ్యాలెట్లలో కస్టమర్లు డిపాజిట్లను చేయరాదని, బ్యాంక్ కూడా వాటిని అంగీకరించరాదని జనవరి 31న ఆర్బీఐ ఆంక్షలు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే కొత్త కస్టమర్లను చేర్చుకోవడంపైనా బ్యాంక్‌పై ఆంక్షలుండగా, తాజా పరిమితులతో దాదాపుగా సంస్థ సేవలు నిలిచిపోయినట్టే అవుతున్నది. అయితే ఈ గడువును పొడిగించాలని ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి పేటీఎం సీఈవో విజయ్ శేఖర్ శర్మ విజ్ఞప్తి చేయగా, ఈ విషయం ఆర్బీఐతోనే తేల్చుకోవాలని మంత్రి సూచించినట్టు సమాచారం.

## ఫండ్స్‌లోకి నిధుల వెల్లువ

### జనవరిలో రూ.21,780 కోట్లు • ఆల్‌టైమ్ గరిష్ఠానికి సిప్‌లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: స్టాక్ మార్కెట్ దాదాపు రికార్డుస్థాయికి సమీపంలో ట్రేడవుతున్న నేపథ్యంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి మదుపరుల పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. జనవరి నెలలో ఈ ఫండ్స్‌లోకి రూ. 21,780 కోట్లు తరలివచ్చాయి. ఇంత మొత్తం రావడం రెండేండ్లలో ఇదే ప్రథమం. డిసెంబర్‌లో వచ్చిన రూ. 16,997 కోట్లకంటే జనవరిలో నిధుల ప్రవాహం 28 శాతం పెరిగినట్టు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ (యాంఫి) గురువారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా నెలవారీ సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్‌లు) ద్వారా ఆల్‌టైమ్ గరిష్ఠస్థాయిలో రూ. 18,838 మదుపు నిధులు వచ్చాయి. డిసెంబర్‌లో సిప్‌ల్లో మదుపరులు రూ. 17,610 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

### 7.92 కోట్లకు సిప్ ఖాతాలు

కొత్తగా 51.84 లక్షల సిప్ రిజిస్ట్రేషన్లు జరగడంతో మొత్తం సిప్ ఖాతాల సంఖ్య 7.92 కోట్లకు చేరింది. జనవరి నెలలో స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉన్నప్పటికీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను దీర్ఘకాలిక మదుపుగా భావించిన ఇన్వెస్టర్లు పెట్టుబడుల్ని పెంచుకుంటున్నారని ప్రభుదాస్ లీలాధర్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ హెడ్ పంకజ్ శ్రేష్ఠ చెప్పారు. 2022 మార్చి (రూ.28,463 కోట్లు) తర్వాత ఈ ఏడాది జనవరిలోనే ఈక్విటీ ఫండ్స్ అధిక పెట్టుబడుల్ని ఆకర్షించాయి. అన్ని విభాగాల ఫండ్స్‌లోకి అధికంగా థీమటిక్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి నిధులు వచ్చాయి. థీమటిక్ ఫండ్స్‌లోకి రూ.4,805 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,257 కోట్లు రాగా, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,039 కోట్లు ఆకర్షించాయి.



## సీఎన్‌జీలో టాటా టిగోర్

### ఆటోమెటిక్ వెర్షన్ విడుదల..గరిష్ఠ ధర రూ.9.5 లక్షలు

ముంబై, ఫిబ్రవరి 8: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ మరో చరిత్ర సృష్టించింది. దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా ఆటోమెటిక్ వెర్షన్ సీఎన్‌జీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 28.08 కిలోమీటర్ల మైలేజీ ఇచ్చే టియాగో, టిగోర్ ఐసీఎన్‌జీ ఏఎంటీ వెర్షన్‌ను గురువారం ప్రవేశపెట్టింది. వీటిలో నాలుగు రకాలుగా లభించనున్న టియాగో ఐసీఎన్‌జీ మాడల్ రూ.7.90 లక్షల నుంచి రూ.8.80 లక్షల వరకు, టిగోర్ ఐసీఎన్‌జీ రూ.8.85 లక్షల నుంచి రూ.9.55 లక్షల లోపు ధరను నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన విభాగ చీఫ్ కమర్షియల్ అధికారి అమిత్ కామత్ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా సీఎన్‌జీ లభ్యత అధికం కావడంతో ఈ సెగ్మెంట్ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, గత రెండేండ్లలో 1.3 లక్షల సీఎన్‌జీ వాహనాలను విక్రయించినట్లు చెప్పారు.

## భారత్‌లో ఏ220 విమాన డోర్ల తయారీ

### డైనమెటిక్ టెక్నాలజీస్‌తో ఎయిర్‌బస్ ఒప్పందం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఏ220 విమానాల డోర్లు భారత్‌లోనే తయారవనున్నాయి. ఈ మేరకు దేశీయ సంస్థ డైనమెటిక్ టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఐరోపాకు చెందిన విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ గురువారం ప్రకటించింది. కాగా, ఓ భారతీయ విమానయాన రంగ తయారీ సంస్థకు దక్కిన అతిపెద్ద ఎగుమతి కాంట్రాక్టుల్లో ఇది కూడా ఒకటని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా అన్నారు. విమానాల విడిభాగాల తయారీలో భారత్ కీలకం అవుతున్నదన్న ఆనందాన్నీ కనబర్చారు. రాబోయే కొన్నేండ్లలో భారత్ నుంచి అందుకునే సేవలు, విడిభాగాల విలువను 1.5 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఎయిర్‌బస్‌కు ఈ కాంట్రాక్టు కలిసిరాగలదన్న ఆశాభావాన్నీ వ్యక్తం చేశారు. ప్రస్తుతం 750 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక ఈ కాంట్రాక్టులో భాగంగా ఎయిర్‌బస్ 220 కార్గో, ప్యాసింజర్ విమానాల డోర్ల తయారీ, సర్వీసింగ్‌ను డైనమెటిక్ టెక్నాలజీస్ అందించనున్నది. ఒక్కో విమానానికి 8 డోర్లుంటాయి. ఈ డోర్లతో పాటు వాటికి సంబంధించిన అన్ని విడిభాగాలనూ సంస్థ తయారు చేయనున్నది. ఇదిలావుంటే ఇప్పటికే ఎయిర్‌బస్‌కు చెందిన ఏ330, ఏ320 విమానాల ఫ్లాప్ ట్రాక్ బీమ్‌లనూ బెంగళూరుకు చెందిన డైనమెటిక్ టెక్నాలజీస్ సంస్థే తయారు చేస్తుండటం విశేషం. అలాగే ఏ220 విమానాల్లో కాక్‌పీట్ ఎస్కేప్ హ్యాచ్ డోర్లనూ ఉత్పత్తి చేస్తున్నది.

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 724 పాయింట్లు పతనం

ముంబై, ఫిబ్రవరి 8: స్టాక్ మార్కెట్లకు రిజర్వు బ్యాంక్ నిర్ణయం రుచించలేదు. ఇప్పట్లో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేకపోవడంతో బ్యాంకింగ్, వాహన రంగ షేర్లు కుదేలయ్యాయి. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులకు తోడు ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికు తమ మొదటి ప్రాధాన్యత అని ప్రకటించడం మదుపరులపై బాంబుపడినట్టు అయింది. దీంతో ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు లేకపోవడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివర్లో ఈ నష్టాలను తగ్గించుకోగలిగింది. మార్కెట్ ముగిసే సమయానికి 723.57 పాయింట్లు లేదా ఒక్క శాతం నష్టపోయిన సెన్సెక్స్ చివరకు 71,428.43 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 212.55 పాయింట్లు కోల్పోయి 21,717.95 వద్ద స్థిరపడింది.

### కుదేలైన వడ్డీరేట్లకు సంబంధించిన షేర్లు

వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయిలోనే ఉంటాయన్న ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యలతో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, వాహన, రియల్టీ, కమోడిటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. వరుసగా ఆరోసారి సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయం మార్కెట్లను అమ్మకాల వైపు నడిపించాయి. అత్యధికంగా ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 3.74 శాతం తగ్గగా, కొటక్ మహీంద్రా బ్యాంక్ 3.53 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 3.34 శాతం, యాక్సిస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్‌లు దిగువకు పడిపోయాయి. బీఎస్‌ఈ బ్యాంకింగ్ సూచీ 1.80 శాతం తగ్గింది. వీటితోపాటు వాహన రంగ షేర్లు మూడు శాతం వరకు కోల్పోగా..రియల్టీ రంగ సూచీలు నాలుగు శాతం వరకు నష్టపోయాయి.




| సెన్సెక్స్ కదలికలు | |
|---|---|
| గత ముగింపు | 72,152 |
| ప్రారంభం | 72,473 |
| గరిష్ఠం | 72,473 |
| కనిష్ఠం | 71,231 |
| ముగింపు | 71,428 |

- ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, వాహన రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. మూడో త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ రంగ సంస్థలు నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడం, ముఖ్యంగా అమ్మకాలు పడిపోవడం కూడా సూచీలు తగ్గడానికి ప్రధాన కారణం.
- వినోద్ నాయర్, జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసుల హెడ్
- ఐటీసీ 4% తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది.
- అలాగే కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, నెస్లె, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్‌టీ, మారుతి, బజాజ్ ఫిన్‌సర్వ్, విప్రో, టాటా మోటర్స్, టైటాన్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.54 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది
- దీంతోపాటు పవర్‌గ్రిడ్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎయిర్‌టెల్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీలు పెరిగాయి.
- మార్కెట్లో 2,204 షేర్లు పతనమవగా, 1,636 షేర్లు లాభపడ్డాయి. కానీ, 105 షేర్లు యథాతథంగా నిలిచాయి.
- రంగాలవారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు 2 శాతం నష్టపోగా, బ్యాంకింగ్ 1.80 శాతం, ఆర్థిక సేవలు 1.46 శాతం, కమోడిటీల 1.13 శాతం షేర్లు పడిపోయాయి.

## 10 మంది మార్కెట్ అనలిస్టులపై సెబీ వేటు

### టీవీ చానల్ ద్వారా షేర్ రిగ్గింగ్ ఆరోపణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఒక ప్రముఖ బిజినెస్ చానల్‌లో స్టాక్ సిఫార్సులిచ్చే 10 మంది నిపుణులు, సంస్థలను నియంత్రణా సంస్థ సెబీ నిషేధించింది. షేర్ రిగ్గింగ్‌కు పాల్పడి చట్టవిరుద్ధంగా వారు ఆర్జించిన రూ. 7.41 కోట్లను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టింది. సెబీ దర్యాప్తు వివరాల ప్రకారం జీ బిజినెస్ న్యూస్ చానల్‌లో ఏ స్టాక్స్‌ను సిఫార్సు చేస్తున్నామన్నది గెస్ట్ నిపుణులు ముందుగానే కొంతమంది'ప్రాఫిట్ మేకర్స్'కు చెపుతారు. సమాచారం అందుకున్న ప్రాఫిట్ మేకర్స్ తొలుత ఆ షేరు లేదా డెరివేటివ్ కాంట్రాక్టులో పొజిషన్లు తీసుకుంటారు. గెస్ట్ అనలిస్టులు కిరణ్ జాదవ్, అశీష్ కేల్కర్, హిమాన్షు గుప్తా, ముదిత్ గోయల్, సిమి భౌమిక్‌ల సిఫార్సులు చానల్‌లో ప్రసారం అయిన తర్వాత ఆ పొజిషన్లను రివర్స్ చేయడం ద్వారా లాభం సంపాదిస్తారు. ఈ ఉదంతంలో నిర్మల్ కుమార్ సోని, పార్థసారథి ధర్, శార్ కమోడిటీస్, మానస్ షేర్‌కామ్, కన్హా ట్రేడింగ్ కంపెనీలు ప్రాఫిట్ మేకర్స్‌గా వ్యవహరించారని సెబీ పేర్కొంది. ఆ లావాదేవీల్లో వచ్చిన లాభాల్ని అందరూ పంచుకుంటారని తెలిపింది. దర్యాప్తు అనంతరం సెబీ 127 పేజీల ఆర్డర్‌ను జారీచేస్తూ ఆ పది సంస్థలు, వ్యక్తుల్ని సెక్యూరిటీల లావాదేవీల నుంచి నిషేధించింది. గెస్ట్ నిపుణులకు సంబంధించిన కంటెంట్‌తో సహా వీడియో రికార్డులు, ఇతర రికార్డుల్ని భద్రపర్చాలని జీ మీడియాను ఆదేశించింది.



## 18న ఆఫ్రికాలో డబ్ల్యూటీఐటీసీ సమ్మిట్

### లోగోను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 ( నమస్తే తెలంగాణ ) : ఐటీ, పరిశ్రమల రంగాలకు చెందిన సంస్థలు విదేశాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్(డబ్ల్యూటీఐటీసీ) ఈనెల 18న ఆఫ్రికాలో సమ్మిట్‌ను నిర్వహించబోతున్నది. ఇందుకు సంబంధించిన లోగోను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆవిష్కరించారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నట్టు డబ్ల్యూటీఐటీసీ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మక్తాలా తెలిపారు. టెక్నాలజీ ఎక్స్ఛేంజ్‌తో పాటు వ్యాపార విస్తరణకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందని వివరించారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.